కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

బండ్లగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం గండిపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గండిపేట మండల కార్యదర్శి డప్పు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన అప్పా చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడు డి.జగదీష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారులను సమర్థించేదిలా ఉందన్నారు. పార్టీ నేతలు పురుషోత్తంచారి, పి.వెంకటేష్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్: అబాబిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హసన్‌నగర్‌లోని నూరీ మసీదు వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ల బృందం స్థానిక ప్రాంతాలకు చెందిన రోగులకు వైద్య సేవలను అందించారు. దాదాపు 250 మంది ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు. వారందరికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆస్పత్రుల సహకారంలో కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు ఫౌండేషన్ సభ్యులు ఖాదర్, మౌలానా హఫీజ్, మహ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవోపా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

మణికొండ: ఆర్య వైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) జిల్లా మహిళా కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం మణికొండలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శిల్ప, జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా స్రవంతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా హైమావతి, కోశాధికారిగా సమత, ఉపాధ్యక్షులుగా చైతన్య, స్వర్ణలత, శబరి, సంయుక్త, శాలిని, స్వప్నలను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా శరణ్య, సంధ్య, లావణ్య, లాస్య, మాధవి, శ్రవంతి, గాయత్రిలను ఎన్నుకున్నారు. వీరంతా ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రీన్‌సిటీలోని జరుగుతున్న ఈదమ్మ నాగదేవతల ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలతో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతిష్ఠాపనోత్సవాలకు బుద్వేల్ గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆలయాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి దేవాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ రాష్ట్ర కన్వీనర్ అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి వెల్లడించారు. బుద్వేల్‌లో ఆదివారం ప్రతిష్ఠించిన ఈదమ్మ తల్లిని ఆయన దర్శించుకున్నారు.

కార్వాన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో ఆయన మజ్లిస్ కార్పొరేటర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్పొరేటర్లు, కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రానున్న వేసవిలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమైన చోట కొత్తవి వేసి లీకేజీల ద్వారా నీరు వృథా కాకుండా చూడాలని అన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు... సొంత భవనం కలేనా?

- మూడేళ్లుగా పాఠశాల భవనంలోనే కొనసాగుతున్న కళాశాల
- సొంత భవనం లేనందున న్యాక్ గుర్తింపునకు దూరం
- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



పాఠశాల భవనంలో కొనసాగుతున్న శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

శంషాబాద్: విద్యార్థి సంఘాల పోరాటాలు.. వినతులు.. స్థానికుల డిమాండ్.. ప్రజా ప్రతినిధుల కృషితో 2022–23వ విద్యాసంవత్సరానికి గాను రాజేంద్రనగర్ (శంషాబాద్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభైంది. అప్పటికప్పుడు మంజూరైన డిగ్రీ కళాశాలను పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన భవనంలో ఏర్పాటు చేశారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న ఈ కళాశాలకు ఇప్పుడు సొంత భవనం లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

షిఫ్టుల వారీగా బోధన...

ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో మొత్తం 361 మంది విద్యార్థులు, ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. మొదటి సంవత్సరం స్వల్పంగా విద్యార్థులు ప్రవేశం పొందినా గత విద్యా సంవత్సరంతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలలో విద్యార్థుల చేరిక పెరిగింది. ప్రస్తుతం పాఠశాలకు చెందిన 7 గదుల్లో రెండు షిఫ్టుల్లో విద్యాబోధన చేస్తున్నారు. ఉదయం ఆర్ట్స్, మధ్యాహ్నం తర్వాత సైన్స్ విద్యార్థులకు బోధిస్తున్నారు.

కేంద్ర నిధులకు దూరం...

సొంత భవనం ఉన్న డిగ్రీ కళాశాలకు మాత్రమే న్యాక్ గుర్తింపు లభిస్తుంది. దీంతో యూజీసీ గ్రాంట్స్ నిధులు అందుతాయి. న్యాక్ గుర్తింపు ఉన్న కళాశాలలకు రాష్ట్రీయ ఉచ్చరిత్ శిక్షా అభియాన్ కింద కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. న్యాక్ గుర్తింపు కావాలంటే కచ్చితంగా సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్ధాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి డిగ్రీ కళాశాలకు అందజేస్తే న్యాక్ గుర్తింపు కోసం వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ప్రభుత్వానికి కళాశాల తరపున ఇటీవల అనేక వినతులు సమర్పించారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా...



డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేస్తే శంషాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్ధాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి అందజేస్తే బాగుంటుందని అధికారులకు.. ప్రజాప్రతినిధులకు వివరించాం. సొంత భవనంతో న్యాక్ గుర్తింపు వస్తుంది. తద్వారా కేంద్రం నుంచి కళాశాలకు కావల్సిన మేరకు నిధులు అందుతాయి. ప్రస్తుతం విద్యార్థుల చేరిక కూడా పెరుగుతోంది. సొంతభవనం లేకపోవడంతో షిఫ్టుల వారిగా బోధన జరుగుతుంది.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్

పారిశుద్ధ్య కార్మికుల సేవలు భేష్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు చెత్త పాయింట్ దగ్గర ముగ్గులు వేసి చెత్త వేయవద్దు అంటూ రాశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని అన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలందరూ జీహెచ్ఎంసీ కార్మికులకు సహకరించాలని తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ని గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. నేతలు పాండుయాదవ్, రావుల భాస్కర్, కొవ్వకుల బాబు, టి.చిన్న, శివారాజ్,మె.శంకర్‌రెడ్డి, అమర్, రమేష్‌రెడ్డి, ఉత్తం, జీహెచ్ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సామేశ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎ.మల్లేష్ రాజ్ తెలిపారు. డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్.వి.నిర్మాణ్, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్‌కీ విల్లా, ఖాదర్ ఎన్ఆర్ఐ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం



దినేష్‌కుమార్

మణికొండ: ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై బుచ్చయ్య గౌడ్ సమాచారం మేరకు.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం, సన్‌షైన్ లే గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో భార్యతో కలిసి నివసిస్తున్న దినేష్‌కుమార్ గత నెల 27వ తేదీన ఇంట్లో నుంచి ఎలాంటి సమాచారం లేకుండా వెళ్లిపోయారు. పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవటంతో అతని భార్య మానస విష్ణుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. అతని సమాచారం తెలిసిన వారు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే...



రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న రూపారెడ్డి

మణికొండ: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన దానితో సమానమేనని, వీలున్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక సారి తప్పనిసరి రక్తదానం చేసి ప్రాణాలను నిలపాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు, కృషి ఫౌండేషన్ అధ్యక్షురాలు రూపారెడ్డి అన్నారు. ఆదివారం తలసీమియా రోగుల నిమిత్తం భాగ్యలక్ష్మీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తలసీమియా రోగులైన చిన్నారులకు సకాలంలో రక్తం లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి వారి రక్త మార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయటంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. తమ కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోజూ ఎవరికి రక్తం అవసరమైనా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, నాయకులు శ్రీకాంత్, సుమ, సీతారాందాస్, దేవరాజుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

డ్రైవ్‌లో 20 మంది మైనర్ల గుర్తింపు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, ఎస్ఐలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వరంగల్ చౌరస్తా, పీడీపీ చౌరస్తా, అత్తాపూర్ ప్రాంతాల్లో చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో పది మంది మైనర్లు వాహనాలు నడిపించడాన్ని గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో పాటు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్న 20 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వద్దని సూచించారు. వాహనాలను ఇచ్చిన వారితో పాటు మైనర్లపై కేసులు నమోదు అవుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. లైసెన్స్ లేని వారు లైసెన్స్‌లను పొందాలని... లేకుంటే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.

అంబారీపై అభయాంజనేయ స్వామి

- ముగిసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



కోలాటం నడుమ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అంబారీపై ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డులో వెలిసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా పుర వీధుల్లో స్వామివారిని అంబారీపై ఊరేగించారు. కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజేయుడిని కొలుస్తూ పాడిన పాటలు అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. నయనానందకరంగా స్వామివారి మూల్‌విరాట్‌ను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, ఆకు పూజ, అభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు యాదవరావు, నర్సింగ రావు, రమేష్, సహదేవ్, గోపాల్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో వసతులు కల్పించండి: సీపీఎం



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని ఇండోర్ స్టేడియంలో వసతులు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఇండోర్ స్టేడియాన్ని సీపీఎం నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 24.61 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టేడియం నిరుపయోగంగా ఉండటం దారుణమన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించిందన్నారు. తర్వాత ఇప్పటి వరకు కనీస నిర్వహణ లేనందున స్విమ్మింగ్ పూల్ ఎండిపోయి అందులో చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇండోర్ స్టేడియంలో వసతులు కల్పించి అందుబాటులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

- రాజేంద్రనగర్ పరిధిలో కాలనీలు, బస్తీల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురికాకుండా కాపాడి ఆట స్థలాలుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజేంద్రనగర్ మండల నేతలు పి.సి.కె.భాస్కర్, జి.ఎం.కురుమయ్య, జి.ఎం.గట్టయ్య, నరసింహ, లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నియామక పత్రాన్నిస్తున్న మండల ఇంచార్జి

మణికొండ: ఎమ్మార్పీఎస్‌ను గ్రామ స్థాయిలో పటిష్ఠం చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని గండిపేట మండల ఇంచార్జి పి.గణేష్‌మాదిగ అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో నూతన కమిటీని ఆయన సమక్షంలో ఎనుకున్నారు. వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదిగ రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేసేందుకు మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం.రవికుమార్, అధికార ప్రతినిధిగా డి.ఫణీందర్, ఉపాధ్యక్షుడిగా డి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.అజయ్, కార్యదర్శిగా డి.అభిలాష్, కోశాధికారిగా డి.రోహన్, ప్రచార కార్యదర్శిగా సు. దీర్‌లను ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...



నార్సింగిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: వారంతా 22 సంవత్సరాల క్రితం కలిసి ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం ఎవరికి తోచిన విధంగా వారు జీవితంలో స్థిరపడ్డారు. తమ పూర్వ స్నేహితులంతా ఒక సారి కలిసి ఆనందంగా గడపాలని నిర్ణయించుకుని ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23వ విద్యా సంవత్సరంలో వారు పదవ తరగతి ఉత్తీర్ణులయ్యారు. వారంతా తిరిగి ఆదివారం నార్సింగి పక్కన ఉన్న ఏకే ఫంక్షన్ హాల్‌లో కలిసి రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. వారు చేస్తున్న పనులు, కుటుంబాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు ఎం.డి.ఫసియుద్దీన్, యాదగిరి, కమల్‌సింగ్, ప్రభావతి, శ్రీదేవి, అనిత, శైలజలను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు నవీన్‌కుమార్, శ్రీను, సంతోష్, రాఘవేందర్, పద్మారావు, దేవేందర్, రాజు, నర్సింగ్, శ్రీనాథ్, శ్రీకాంత్, కృష్ణ, రమేష్, ప్రదీప్‌రెడ్డి, శివరాజ్, కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు తగిన గుణపాఠం తథ్యం: కార్తీక్‌రెడ్డి



మాట్లాడుతున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

రాజేంద్రనగర్: అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్న తెలంగాణను సర్వ నాశనం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం తప్పదని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్.వై.ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులతోనే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలతో అధికార పీఠం ఎక్కి ఏ ఒక్కరినీ వదలకుండా ఇబ్బందులకు గురి చేయడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సంఘటితమై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న వింత పోకడలకు త్వరలోనే గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. నాయకులు అబ్దుల్ ముఖి చందా, రెహమాన్, అమీర్, ఆఫ్సర్, నవాజ్, మక్బూల్, గౌస్, సాజిదా బేగం, దావలాత్, షకీల్, దస్తగిరి, మహబూబ్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. మల్లన్న కల్యాణోత్సవం



శంషాబాద్‌లో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయమే గ్రామస్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి గంపలతో చేరుకున్నారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అక్కడే బోనాలను సిద్ధం చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో మల్లన్న కల్యాణోత్సవంతో పండగ వాతావరణం నెలకొంది. కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, డి.లక్ష్మణ్, పొన్న రమేష్, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా మల్లన్న జాతర...

శంషాబాద్: పట్టణంలోని మెహిదీగార్డెన్‌లో మల్లన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. స్వామివారి కల్యాణం, బోనాల ఊరేగింపుతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, మాజీ కౌన్సిలర్లు పి.సంజయ్‌యాదవ్, మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు, సీనియర్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్, చక్రధర్‌రెడ్డి, రాజు, శ్రీకాంత్‌యాదవ్, చరణ్, శివ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి తదితరులు



జాతరలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు